

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 30-10-2026 | సంపుటి - 31 | సంచిక - 156 | రూ : 4 | పేజీలు: 8



15 నుంచి రాతి నిర్మాణాల పనులు

- రామాలయం అభివృద్ధి పనుల్ని సమీక్షించిన మంత్రి పొంగులేటి

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, నవంబరు 15 నుంచి రాతి నిర్మాణాల పనులు ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సర్పంచి పూనెం కృష్ణ, అధికారులతో కలిసి గురువారం రాములవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ దామోదర్‌రావు సాదర స్వాగతం పలకగా అర్చకుల పర్యవేక్షణలో వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష చేసి ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, పుష్కరాల ఏర్పాట్ల గురించి అధికారులకు కీలక సూచనలు చేశారు. దీనికి ముందు ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే కొన్ని పనులు స్లాబ్‌ల వరకు పూర్తయ్యాయని, కాంక్రీట్ నిర్మాణాలతోపాటు మాడవీధుల ఏర్పాటు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలకల్లా ఆలయ అభివృద్ధితో పాటు పుష్కర ఘాట్లు సుందరంగా తయారు కావాలని స్పష్టం చేశారు.

చంద్రబాబు విజ్ఞప్తికి

తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- అర్నబ్ తుపానుతో దెబ్బతిన్న ఏపీకి అండగా నిలిచిన తెలంగాణ
- సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి రేవంత్ సర్కార్ సానుకూల స్పందన
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు 500 మంది సిబ్బంది తరలింపు
- తుపాను కారణంగా 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- విపత్కర సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య అరుదైన స్నేహబంధం



అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. తుపాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకారం అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి పట్ల రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే స్పందించింది. ఈ మేరకు ఏపీకి ప్రత్యేక బృందాలను పంపింది. అర్నబ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం సహా పలు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 16,000లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వం తరువాయి 2లో



నిమ్స్‌పై...

మరోసారి ఏసీబీ నజర్

- టెండర్ల కేటాయింపులపై ఆరా
- మెడికల్ స్టోర్లు, ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ ఏజెన్సీలపైనా దృష్టి
- రాత్రి పొద్దుపోయే వరకు సాగిన తనిఖీలు

హైదరాబాద్: ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి నిరోధక శాఖ మరోసారి తనిఖీలు చేపట్టింది. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ కమలాకర్, డీఎస్పీలు చలపతి, లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని దాదాపు 20 మందితో కూడిన బృందం గురువారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని సోదాలు చేపట్టింది. ఇది అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఆదాయానికి తరువాయి 2లో

రెబెల్స్ పై వెంటనే

వేటు వేయండి...

- పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా పాటించాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ 2లో
- ఎన్డీఏ రెబల్ అభ్యర్థులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశం
- అభ్యర్థులను కాకుండా ఎన్డీఏను చూసి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి



ఏ ప్రయోజనమూ దెబ్బతినదు..

అమెరికా ఒప్పందంపై కేంద్రం

- అమెరికా వాణిజ్య ఒప్పందంతో రైతులకు నష్టం జరగదన్న కేంద్ర మంత్రి
- రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడలేదని స్పష్టీకరణ
- అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై రైతు సంఘాల ఆందోళన
- ఈ ఒప్పందంతో భారత్‌కే ఎక్కువ ప్రయోజనమని గోయల్ వ్యాఖ్య
- సుంకాల తగ్గింపుపై త్వరలో వెలువడనున్న పూర్తి వివరాలు



అమెరికాతో ప్రతిపాదిత తొలి దశ వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాల్లో నెలకొన్న ఆందోళనలను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కొట్టిపారేశారు. ఈ ఒప్పందం వల్ల భారత రైతులు లేదా ఇతర వర్గాల తరువాయి 2లో

గ్యాస్ ధరలు, పెన్షన్, ఐటీఆర్..


నేటి నుంచే సరికొత్త మార్పులు!

- 80 ఏళ్లలోపు అర్హులైన పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ ప్రారంభం
- ఆడిట్ వర్తించే నిర్దిష్ట పన్ను చెల్లింపుదారులకు ఐటీఆర్ గడువు నవంబర్ 21 వరకు పొడిగింపు
- నవంబర్ 1 ఎల్‌పీజీ ధరలపై అక్టోబర్ 29 నాటికి అధికారిక ప్రకటన లేదు



- ఇంకా రాని వికలాంగుల పెన్షన్ సంస్కరణలకు కొత్త అమలు మార్గదర్శకాలు

నవంబర్ నెల ప్రారంభం కానుండటంతో సామాన్యులు, పెన్షనర్లు, పన్ను చెల్లింపుదారులు కొన్ని ముఖ్యమైన ఆర్థిక తరువాయి 2లో



మార్చి నాటికి ఎండల తీవ్రత

55 వేల మరణాల ముప్పు?

- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం 2లో

అర్నబ్ బీభత్సం

సముద్రంలో చిక్కుబడ్డ భారీ నౌక

- కేజీ బేసిన్‌లోని రవ్వా ఆయిల్ ఫీల్డ్ వద్ద నిలిచిపోయిన సిగ్మా పెరల్
- ఇంజిన్ ఫెయిల్యూర్ కావడమే ఘటనకు కారణంగా గుర్తింపు
- రంగంలోకి దిగిన కోస్ట్ గార్డ్.. సుజయ్ నౌకతో సహాయక చర్యలు

'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ తుపాను కారణంగా విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు వెళ్తున్న ఒక భారీ కార్గో నౌక సముద్రంలో చిక్కుకుపోయింది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ నౌక తరువాయి 2లో



నిమ్స్‌పై మరోసారి ఏసీబీ నజర్

హైదరాబాద్: ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి నిరోధక శాఖ మరోసారి తనిఖీలు చేపట్టింది. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ కమలాకర్, డీఎస్పీలు చలపతి, లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని దాదాపు 20 మందితో కూడిన బృందం గురువారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని సోదాలు చేపట్టింది. ఇది అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్‌ను ఇటీవల ఏసీబీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఆసుపత్రిపై ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించి లక్ష్మీభాస్కర్ బినామీలు, సన్నిహితుల ఇళ్లల్లో అధికారులు తనిఖీలు చేసి ఆధారాలు సేకరించారు. తాజాగా మరోసారి నిమ్స్‌లో అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

కేటాయింపులో గోల్‌మాల్?

గతంలో ఆసుపత్రిలో జరిగిన టెండర్ల కేటాయింపులపై ఏసీబీ ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తమకు నచ్చిన వారికి టెండర్లు దక్కేలా చేయడంలో లక్ష్మీభాస్కర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారుల పాత్ర ఎంతవరకు ఉందనే విషయంపై ఆరా తీశారు. నిమ్స్‌లో క్యాంటీన్, సెక్యూరిటీ, మెడికల్ షాపులు, మందుల సరఫరా, సర్జికల్ విభాగాలకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపు, టెండర్ల ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఏసీబీ దృష్టికి రావడంతో అందుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. నాలుగో తరగతి సిబ్బంది కేటాయింపులో కూడా వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారించారు. టెండర్ల ఆహ్వానం నుంచి కాంట్రాక్టుల కేటాయింపు వరకు అనుసరించిన మొత్తం వ్యవహారంపై అధికారులు ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. దీనిలో భాగంగా టెండర్ల నిబంధనల అమలు, బిడ్డర్ల అర్హతలు, ఆయా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో లక్ష్మీభాస్కర్‌తోపాటు గతంలో కీలక బాధ్యతల్లో ఉన్న ఉన్నతాధికారుల పాత్రపైనా ఆరా తీస్తున్నారు. రోగులు, వైద్యులకు ఆహారం సరఫరా చేసే క్యాంటీన్‌లో నాణ్యత పరిశీలించి నమూనాలను సేకరించారు.

మందుల సరఫరాపైనా..

గతంలో వివిధ కంపెనీల నుంచి నిమ్స్‌కు సరఫరా అయిన మందులపై కూడా ఏసీబీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నిమ్స్‌కు రేట్ కాంట్రాక్టు ప్రకారం ఔషధాలను డీలర్లు సరఫరా చేస్తుంటారు. గతంలో కొనుగోలు చేసిన మందుల్లో కొన్నింటిలో నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలున్నాయి. నెల రోజుల క్రితం మందులకు సంబంధించి కొన్ని శాంపిళ్లను ల్యాబ్‌లకు పంపి పరిశీలించినట్లు తెలుస్తోంది. కమీషన్లు తీసుకొని నాణ్యత లేని మందులను అంటగట్టారా.. అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు. అవినీతి, అంతర్గత కుమ్ములాటలు, వైద్యుల మధ్య రాజకీయాలు నిమ్స్‌ను ఏ దరికి చేరుస్తాయో అని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సప్త సేవలు.. సాంకేతిక హంగులు!



*** అందుబాటులోకి తెచ్చిన సీఐడీ విభాగం**

హైదరాబాద్: సేవల్ని మరింత సమర్థంగా అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగానే సీఐడీ విభాగం ఆధ్వర్యంలో ఏడు డిజిటల్ సేవల్ని తాజాగా అందుబాటులోకి తెచ్చింది. పారదర్శకత, జవాబుదారీతనం పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ సేవల్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీజీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్, సీఐడీ డీజీ చారుసిన్హా, అదనపు డీజీపీ అకున్ సబర్వాల్, ఐజీ గజరావు భూపాల్, డీఐజీలు నారాయణ నాయక్, పరిమళ హననూతన్, ఎస్పీలు విశ్వజిత్, రూపేశ్, ప్రవీణ్‌కుమార్, మల్లారెడ్డి, బాలకోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సేవల్ని వినియోగించుకున్నప్రజల నుంచినేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలీసుల వ్యవహారశైలిపై ప్రజల స్పందనను ఈ సెంటర్‌లో నమోదు చేసి నివేదికలు రూపొందిస్తారు. మహిళా భద్రత విభాగం రూపొందించిన 'భరోసా' సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివరాలను నమోదు చేయనున్నారు. రాష్ట్రస్థాయి డ్యాష్ బోర్డులు, 23 రకాల నివేదికలు ఈ సాఫ్ట్‌వేర్‌లో అందుబాటులో ఉంటాయి. అనుమానితులు, గుర్తుతెలియని మృతదేహాలు, తప్పిపోయిన వ్యక్తులను గుర్తించేందుకు మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. 9.8 లక్షలకుపైగా ఫొటోలతో డేటా బ్యాంకు రూపొందించారు. ఎవరిదైనా ఫొటోను ఈ యాప్‌తో అనుసంధానం చేస్తే డేటాబ్యాంకులో వడబోసి ఉందో.. లేదో.. 15 సెకన్లలోనే తేల్చనుంది. జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీల సమాచారాన్ని పోలీసులకు సకాలంలో చేరవేసేందుకు జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. ఖైదీల విడుదల అనంతరం వివరాలను సంబంధిత శాఖల అధికారులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. 'క్రైమ్ సీన్ చాన్స్ ప్రింట్' యాప్ ద్వారా నేరస్థలిలోని వేలిముద్రల్ని ఆండ్రాయిడ్ ఫోన్లతోనే సేకరించి.. అక్కడి నుంచే రాష్ట్ర స్థాయిలోని సర్వర్‌కు పంపించనున్నారు. దేశంలోనే తొలిసారి ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం విశేషం. నేర పరిశోధనలో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్‌వోపీలు) రూపొందించారు. శారీరక, ఆస్తి నేరాలు, మహిళలుపిల్లలపై నేరాలు, ఇతర నేరాలకు సంబంధించి మార్గదర్శకాలను అందులో పొందుపరిచారు. దర్యాప్తు నాణ్యతను పెంచి, న్యాయస్థానాల్లో నేర నిరూపణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఇవి దోహదం చేయనున్నాయి. సీఐడీ కార్యకలాపాలు, సేవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలిపేందుకు కొత్త వెబ్‌సైట్ https://cid.tspolice.gov.in/ను అందుబాటులోకి తెచ్చారు.

ఏపీలో స్థానిక ఎన్నికలు
పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈరోజు ప్రారంభమైంది. ఈ ఓటింగ్ రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, దూర ప్రాంతాల్లో నివసించే అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఈ ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా జరిపేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), ఇద్దరు సహాయకులను నియమించారు. నిబంధనల ప్రకారం ఓటింగ్ నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోస్టల్ ఓటింగ్ పూర్తయిన వెంటనే, బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మార్చి నాటికి ఎండల తీవ్రత 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణ నష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

అర్నబ్ బీభత్సం
సముద్రంలో చిక్కుబడ్డ భారీ నౌక

'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ తుపాను కారణంగా విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు వెళ్తున్న ఒక భారీ కార్గో నౌక సముద్రంలో చిక్కుకుపోయింది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ నౌక ముందుకు కదలలేని స్థితిలో నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన 'సిగ్మా పెరల్' అనే కార్గో నౌక విశాఖ పోర్టులో సరుకును అన్‌లోడ్ చేసిన అనంతరం సింగపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో కేజీ బేసిన్‌లోని రవ్వా ఆయిల్ ఫీల్డ్ సమీపానికి చేరుకోగానే, తుపాను ప్రభావంతో ఎగిసిపడుతున్న భీకరమైన అలల ధాటికి నౌక ఇంజిన్ ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భారత తీర రక్షక దళం (కోస్ట్ గార్డ్) అధికారులు తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు కేంద్రంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. నౌకలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించేందుకు 'సుజయ్' అనే కోస్ట్ గార్డ్ నౌకను ఘటనా స్థలానికి పంపించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

చంద్రబాబు విజ్ఞప్తికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. తుపాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సహకారం అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి పట్ల రేవంత్ రెడ్డి సర్కారు వెంటనే స్పందించింది. ఈ మేరకు ఏపీకి ప్రత్యేక బృందాలను పంపింది. అర్నబ్ తుపాను ప్రభావంతో అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం సహా పలు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 16,000లకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వందలాది గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి సహాయం కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తిపై భట్టి విక్రమార్క వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలను ఏపీకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. టీజీఎన్పీడీసీఎల్ నేతృత్వంలోని ఈ బృందాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరి, కూలిపోయిన స్తంభాలు, తెగిపడిన తీగల మరమ్మతు పనుల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఏపీలో 1,700 మంది స్థానిక సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమవ్వగా, మరో 500 మందిని ఇతర డిస్కంల నుంచి రప్పిస్తున్నారు. వీరికి తోడుగా తెలంగాణ సిబ్బంది కూడా చేరడంతో పనులు వేగవంతమయ్యాయి. వీలైనంత త్వరగా, వీలైతే 24 గంటల్లోనే విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఇరు రాష్ట్రాల సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తున్నారు.

ఏ ప్రయోజనమూ దెబ్బతినదు.. అమెరికా ఒప్పందంపై కేంద్రం

అమెరికాతో ప్రతిపాదిత తొలి దశ వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాల్లో నెలకొన్న ఆందోళనలను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కొట్టిపారేశారు. ఈ ఒప్పందం వల్ల భారత రైతులు లేదా ఇతర వర్గాల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగదని ఆయన గురువారం స్పష్టమైన హామీ ఇచ్చారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ ఒప్పందం దేశానికి బలమైన తులనాత్మక ప్రయోజనాన్ని అందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒప్పంద వివరాలు బయటకు వచ్చాక దేశ ప్రజలు సంబరాలు చేసుకుంటారు. మన రైతులు లేదా ఇతర భాగస్వాముల ప్రయోజనాల విషయంలో ఒక్క చిన్న అంశంలో కూడా రాజీ పడలేదని నేను ధైర్యంగా ప్రకటించగలను" అని పీయూష్ గోయల్ అన్నారు.

ఒప్పందం నేపథ్యం ఏమిటి?

2026 ఫిబ్రవరిలో భారత్, అమెరికా ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఒక ప్రాథమిక ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించాయి. దీని ప్రకారం, చాలా భారతీయ వస్తువులపై అమెరికా దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. కొన్ని సందర్భాల్లో 50 శాతం వరకు ఉన్న సుంకాలు కూడా తగ్గనున్నాయి. ప్రతిగా, భారత్ కూడా అమెరికాకు చెందిన కొన్ని పారిశ్రామిక వస్తువులతో పాటు బాదం, వాల్‌నట్స్, పండ్లు, కూరగాయలు, వైన్ వంటి వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న అడ్డంకులను, సుంకాలను తగ్గించడానికి అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందంపై పూర్తి వివరాలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

రైతు సంఘాల ఆందోళన ఎందుకు?

ఈ ఒప్పందంపై సంయుక్త కిసాన్ మోర్చా వంటి రైతు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొక్కజొన్న, బాదం, యాపిల్స్, సోయాబీన్ ఆయిల్ వంటి అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం వల్ల, అక్కడి సబ్సిడీలతో కూడిన చౌక దిగుమతులు దేశీయ మార్కెట్లను ముంచెత్తుతాయని వారు భయపడుతున్నారు. దీనివల్ల స్థానిక రైతులకు గిట్టుబాటు ధరలు పడిపోయి, వారి ఆదాయం దెబ్బతింటుందని ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలోనే పీయూష్ గోయల్ పై వ్యాఖ్యలు చేశారు. సున్నితమైన వ్యవసాయ రంగాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ఒప్పందం వివరాలు వెల్లడయ్యాక అందరికీ దీనిపై స్పష్టత వస్తుందని ఆయన వివరించారు.

గ్యాస్ ధరలు, పెన్షన్, ఐటీఆర్..
నేటి నుంచే సరికొత్త మార్పులు!

నవంబర్ నెల ప్రారంభం కానుండటంతో సామాన్యులు, పెన్షనర్లు, పన్ను చెల్లింపుదారులు కొన్ని ముఖ్యమైన ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. నవంబర్ 1 నుంచి జీఎస్టీ నిబంధనల్లో మార్పులు అమల్లోకి రానుండగా, పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆడిట్ వర్తించే కొందరు పన్ను చెల్లింపుదారులకు ఐటీఆర్ దాఖలు గడువు కూడా పొడిగించారు. ఎల్‌పీజీ సిలిండర్ల ధరలపై నెలవారీ సమీక్ష జరగనుంది.

జీఎస్టీ నిబంధనల్లో మార్పులు

నవంబర్ 1 నుంచి జీఎస్టీకి సంబంధించిన కొన్ని నిబంధనలు మారనున్నాయి. విక్రయం తర్వాత ఇచ్చే డిస్కౌంట్లకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేయడం, ఇన్‌వర్టెడ్ డ్యూటీ నిర్మాణం కారణంగా రిఫండ్ కోసం ఎదురుచూస్తున్న వ్యాపారాలకు తాత్కాలిక రిఫండ్‌లను వేగంగా అందించడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం. ఈ నిర్ణయాలతో వ్యాపారాలకు పన్ను సంబంధిత ప్రక్రియలు మరింత సులభమయ్యే అవకాశం ఉంది.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ ముఖ్యం

ప్రభుత్వ పెన్షన్ పొందుతున్నవారు తమ పెన్షన్ నిరంతరాయంగా అందాలంటే ప్రతి సంవత్సరం లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. 80 ఏళ్లలోపు వయసున్న అర్హులైన పెన్షనర్లు నవంబర్ 1 నుంచి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. 80 ఏళ్లు నిండినవారికి అక్టోబర్ 1 నుంచే అవకాశం కల్పించారు. సాధారణంగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు నవంబర్ 30 చివరి తేదీ. గడువులోగా సమర్పించకపోతే పెన్షన్ చెల్లింపుల్లో తాత్కాలిక అంతరాయం ఏర్పడవచ్చు.

ఐటీఆర్ గడువు పొడిగింపు

202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీఆర్ దాఖలులో, ఆడిట్ తప్పనిసరైన నిర్దిష్ట వర్గాల పన్ను చెల్లింపుదారులకు ఊరట లభించింది. అసెస్‌మెంట్ ఇయర్ 2026 27కు సంబంధించిన రిటర్నుల గడువును అక్టోబర్ 31 నుంచి 2026 నవంబర్ 21 వరకు పొడిగించారు. ఈ వెసులుబాటు అందరు పన్ను చెల్లింపుదారులకు వర్తించదు. కాబట్టి తమకు వర్తించే గడువును పన్ను చెల్లింపుదారులు నిర్ధారించుకోవాలి.

ఎల్‌పీజీ ధరలపై ఉత్కంఠ

చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రతి నెలా మొదటి తేదీన ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను సమీక్షిస్తాయి. దీంతో నవంబర్ 1న గృహ అవసరాల సిలిండర్లు, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు ఉంటాయా అనే ఆసక్తి నెలకొంది. అయితే అక్టోబర్ 29 నాటికి నవంబర్ 1 ధరల మార్పుపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ధరలు పెరుగుతాయా? తగ్గుతాయా? అనేది అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే స్పష్టమవుతుంది.

రెబెల్స్ పై వెంటనే వేటు వేయండి: చంద్రబాబు ఆదేశం

పార్టీ ధర్మాన్ని ఎలాంటి పునరాలోచన లేకుండా పాటించాల్సిందేనని, ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్ అభ్యర్థులను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలిసి ఎంతో శ్రమించి సీట్ల సర్దుబాటు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నేతలకు దీనిపై సానుకూల సందేశం పంపామని, కాబట్టి ఓటర్లు అభ్యర్థులను కాకుండా ఎన్డీఏ కూటమిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద భర్తీ చేయనున్న 33 కేటగిరీల పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసింది. ఎఫ్25 నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఐడీఓసీలోని డీఎంహెచ్ఓ కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచారు.జాబితాపై అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:వినియోdగదారుల మన్ననలు పొందుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగాలని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్స్ హౌస్‌ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటలో నూతనంగా వ్యాపార సంస్థను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యాపారులు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, డ్రై ఫ్రూట్స్ హౌస్ సిబ్బంది రమేష్, తిరుపతమ్మ, శివ, కవిత, రాజేష్, శివారెడ్డి, స్వాతి, తరుణి, నిర్వాహకులు పాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి

: న్యాయవాది రవీందర్..



జనగామ, ప్రజాస్ఫూర్తి : బాలల పై లై గిక వేధింపులను అరికట్టి, వారి హక్కు లకు రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం పై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాల ని జనగామ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మంచాల రవీంద ర్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర శ్రీదేవి ఆదేశాల మేర కు గురువారం పెద్దపహాడ్ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో బాలికలకు న్యా య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ 1 8 ఏళ్లలోపు బాలబాలికల రక్షణకు పో క్సో చట్టం అమలులో ఉందని,ఈచట్టం కింద నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. ఎవరైనా వే ధింపులకు గురిచేస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని, అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిం చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పి.మల్లారెడ్డి ,పారా లీగల్ వాలంటీర్లు బి.శేఖర్, పి.జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

శ్రీరంగాపూర్ తహసిల్దార్ వరలక్ష్మి



శ్రీరంగపురం మండలం,ప్రజాస్ఫూర్తి:డిగ్రీ (పట్టభద్రులు) పాస్ అయిన ప్రతి ఒక్కరూ మండలంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని శ్రీరంగాపూర్ తహసిల్దార్ వరలక్ష్మి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇందుకోసం నిర్దిత ఫారమ్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో ఫామ్ 18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మండల పరిధిలోని ప్రతి డిగ్రీ విద్యావంతుడు బాధ్యతగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓ ఆదేశాల మేరకు టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి దుప్పటి రవి కళాబృందం గురువారం ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల కలిగే పరిణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను పెంచాలని కళాబృందం సభ్యులు సూచించారు. చెట్ల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని, వాతావరణ మార్పులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కళారూపాల ద్వారా చైతన్యపరిచారు.ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు దుప్పటి రవి, ఈర్ల సాగర్, మంకాల యాకూబ్, కొండపర్తి స్వప్న, కంచర్ల శ్యామల, గడ్డం రజిత పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధన ఉండాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికల లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలల్లో నూతన విద్యా విధానాలు ఉపయోగపడేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.గురువారం మహబూబాబాద్ పట్టణంలోని కంకర బోర్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి కూర్చొని పాఠాలు విన్నారు.ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, షెడ్యూల్ ప్రకారం సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.ఇంగ్లీష్‌భాషపై నైపుణ్యం పెంచేలా ప్రతి అంశాన్ని ఇంగ్లీషులోనే బోధించాలని తెలిపారు.పిల్లల లక్ష్యాలను నిర్ధారించుకుని ఇంజనీరింగ్, మెడికల్,ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. డిజిటల్ తరగతులు,ప్రాక్టికల్స్,రీడింగ్,రైటింగ్ తో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాలను కూడా బోధించాలని సూచించారు.పదవ తరగతి విద్యార్థులు మోక్షిత, చరణ్, వరుణ్ తేజ్, సాత్విక లతో మాట్లాడి బోధన అర్థమవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో పారిశుధ్యం పాటించాలని, అవసరమైన చోట కాంపౌండ్ వాల్, టాయిలెట్లు నిర్మించాలని, మధ్యాహ్న భోజన సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.ఆర్ బిఎస్ కె బృందంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు, మానసిక ఉల్లాస తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు మందుల శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు ఎం.కె. నాయక్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

*** సిఐటియు డిమాండ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండలం గడ్డిపల్లి మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు నాయకులు ఎస్ కె యాకూబ్ రాష్ట్ర వ్యాప్తంగా 54 లక్షల 24 వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నకార్మిక సంఘాలకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వక కేవలం రెండు వేల రూపాయలకే వంట చేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు నాయకులు యాకూబ్ అన్నారు గడ్డిపల్లి మోడల్ స్కూల్లో కనీసం వంటగది కూడా లేక చెట్ల కిందనే వండుతున్నారని గ్యాస్ కు బిల్లులు ఇవ్వకపోవడం వలన గ్యాస్ లేక వర్షం వచ్చి కట్టెలు తడవడం మూలాన పొయ్యిమండక ఏజెన్సీలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు విద్యార్థుల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ఈ ప్రభుత్వాలు 2000 రూపాయల వేతడానికే భోజనాలు వండిస్తూ బిల్లులు కిరాణా షాపుల దగ్గర అప్పు తెచ్చి కూరగాయలు పప్పు గుడ్లు అప్పు తెచ్చిపెట్టి బిల్లు వచ్చిన తర్వాత వడ్డీలు చెల్లించి ఏజెన్సీలో నడుపుతున్నారని అన్నారు వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ లకి ప్రతినెల గ్యాస్ సప్లై చేయాలని దానితోపాటు కనీస వేతనం 18000 ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కార్మికులకి యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ,దేవమ్మ,మణెమ్మ, నాగమ్మ, జానకమ్మ, వరమ్మ, కె అరవిందు, తదితరులు పాల్గొన్నారు

సినీ నిర్మాత నాగబాబు జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

*** వృద్ధులకు దుప్పట్లు , భోజన ప్యాకెట్స్ పంపిణీ**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : సినీ నిర్మాత , ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదల నాగబాబు జన్మదినం సందర్భంగా చిరంజీవి యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వి విల్సన్ బాబు ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ ,రైల్వే స్టేషన్ , పోస్ట్ ఆఫీస్ , సూపర్ బజార్ తదితర ప్రాంతాలలో ఉన్నటువంటి అనాధలు , వృద్ధులకు దుప్పట్లు , భోజనం ప్యాకెట్స్ తో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు . అనంతరం విల్సన్ బాబు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, పేదలు, వృద్ధులకు సేవ చేయాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టామని ఆయన అంటూ, చలికాలంలో వృద్ధులకు దుప్పట్లు అందించడం ద్వారా వారికి అండగా నిలవడంతో పాటు, భోజనం ప్యాకెట్స్ అందజేయడం ద్వారా ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించి సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం, సాటి మనుషుల పట్ల బాధ్యతను చాటి చెబుతూ , నాగబాబు కుటుంబ సమేతంగా సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని అయన ఆకాంక్షిస్తూ కొత్తగూడెం ప్రజల తరపున నాగబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు మతిన్ , దుర్గారావు, సందీప్ , అజయ్ కుమార్ , గౌస్ , రవి , పాషా తదితరులు పాల్గొన్నారు .

మార్చి నాటికి కాళేశ్వరాలయ పనులు పూర్తి చేయాలి

*** గోదావరి పుష్కరాలే లక్ష్యంగా అధికారులకు ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజాస్ఫూర్తి: గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆలయ పనులను పరిశీలించారు. అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణం, భూసేకరణ, బోట్ జెట్టీ ఏర్పాటుపై సమీక్షించారు.పనుల్లో వేగం తగ్గించకుండా, నాణ్యతలో రాజీ పడకుండా నిర్దిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన డిజైన్లను త్వరగా ఖరారు చేసి ఘాట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్షించాలని, తాను నెలకోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని తెలిపారు.ఆలయ పునర్నిర్మాణానికి రూ.195 కోట్లు మంజూరయ్యాయని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. ఘాట్ల నిర్మాణానికి ఇప్పటికే 13 ఎకరాల భూసేకరణ పూర్తయిందని, మరో 18 ఎకరాలు సేకరించాల్సి ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, వివిధ శాఖల అధికారులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు

లింగాల ఘణపురాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

: బీఆర్ఎస్ నాయకులు



లింగాల ఘణపురం/జనగామ, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో లింగాల ఘణపురం మండలానికి చోటు కల్పించకపోవడంపై మండల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక మండలంలోని చెరువులన్నీ ఎండిపోయాయని, ఒక్క చెరువు కూడా పూర్తిస్థాయిలో నిండ లేదని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని గ్రామాల్లో కెనాల్ నీటి ఆధారంగా కొద్దిపాటి పంటలను సాగు చేసుకుంటున్నారని వివరించారు. మండలంలోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని లింగాల ఘణపురాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, లేకపోతే రైతుల పక్షాన దశలవారీగా ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో జాతీయ న్యాయ సేవధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయమూర్తి కుంభ సందీప్ అధ్వర్యంలో ఎంపిపిఎస్ బాలికల పాఠశాల బోథ్ లో విద్యార్థులకు పొక్సో చట్టం బాలికల పై లైంగిక వేధింపులు విద్యార్థులకు బాలల హక్కులు బాలికల రక్షణ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి స్పర్శ-చెడు స్పర్శ మధ్య తేడాల గురించి అవగాహన కలిగి ఉండే విధంగా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలు తమపై జరిగే అనుచిత ప్రవర్తనను గుర్తించి భయపడకుండా నమ్మకమైన పెద్దలకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఇలాంటి విషయాలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రి నెంబర్ కు సంబంధించిన గోడ పత్రికలను విద్యార్థులకు పంపిణి చేయించారు. ఈ కార్యక్రమంలో ఏజిపి పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్ కుమార్, పిసి లైలా అంబాజీ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట నేలమట్టం

*** తుఫాను ప్రభావంతో గాలివాన.. ఏడు ఎకరాల్లో వరి పంటకు నష్టం**



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి:ఆరుగాలం శ్రమించి, రెక్కల కష్టంతో సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో గాలివాన రూపంలో ప్రకృతి విపత్తు రైతును తీవ్రంగా దెబ్బతీసింది.తుఫాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు వరి పంట నేలకొరగడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన దొంతిరెడ్డి లింగారెడ్డి తనకున్న ఏడు ఎకరాల పొలంలో వరి సాగు చేశాడు. పంట ఏపుగా పెరిగి కోతకు సిద్ధమవుతున్న తరుణంలో తుఫాను ప్రభావంతో గాలివాన వీచింది.దీంతో ఏడు ఎకరాల్లోని వరి పంట నేలకొరిగింది.పంట సాగు కోసం పెట్టుబడులు పెట్టి, నెలల తరబడి కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నేలమట్టం కావడంతో లింగారెడ్డి ఆవేదన చెందుతున్నాడు. గాలివాన కారణంగా తీవ్రంగా నష్టపోయానని, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వస్తాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి, అర్హమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

సమూహ యూత్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ :నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో ప్రముఖ రచయిత డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ఈ నెల 31వ తేదీ శనివారం హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సమూహ యూత్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువతలో సాహిత్యాభిరుచి, సృజనాత్మకత, భావవ్యక్తీకరణను పెంపొందించడంలో ఇటువంటి సాహిత్య వేదుకలు కీలకమని సుంకిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సాహిత్యాభిమానులు, యువ రచయితలు, మిత్రులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాహిత్య వేదుకను విజయవంతం చేయాలని సమూహ నల్లగొండ జిల్లా కన్వీనర్ ప్రభాకర్ కస్తూరి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పగడాల నాగేందర్, మోత్కూరు శ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యాపకులు సందేనబోయిన ప్రభాకర్ డాక్టర్ టంగుటూరి సైదులు, దండి అంజయ్య, మామిడి లింగస్వామి, కట్ట శ్రవణ్ కుమార్, వనజ, బి. చిట్టెమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో ఆడిట్ అధికారుల సమీక్షా సమావేశం



గోలేటీ /కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ,ప్రజా స్ఫూర్తి : బెల్లంపల్లి ఏరియాలోని అన్ని గనులు, విభాగాల అధికారులతో డీజీఎం (ఇంటర్నల్ ఆడిట్ బెల్లంపల్లి రీజియన్) మధుబాబు ఆధ్వర్యంలో, ఎస్ఓ టూ జీఎం స్వామిరాజు అధ్యక్షతన గురువారం స్థానిక జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గనులు, విభాగాల వారీగా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపై పలు కీలక సూచనలు చేస్తూ, ఆడిట్ రికవరీలు మరియు పెండింగ్‌లో ఉన్న ఆడిట్ మెమోల పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు. స్టోర్లలో నిల్వలు, వ్యత్యాసాలపై ఎప్పటికప్పుడు భౌతిక ధ్రువీకరణ చేపడుతూ, కచ్చితమైన బిల్లులను సకాలంలో సమర్పించాలని స్పష్టం చేశారు. అలాగే హెచ్‌బీఎల్ ఆర్ఎస్ క్లెముల స్థితిగతులతో పాటు గతంలో వచ్చిన ఆడిట్ అభ్యంతరాలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వీరన్న, డీజీఎం (ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఫైనాన్స్ మేనేజర్ మామిడి రవికుమార్, సీహెచ్‌పీ హెచ్ఓడీ కోటయ్య, ఖైరిగూడ ఓసీ మేనేజర్ జె. శంకర్, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ వీరుల ఆశయాలపై జిల్లాలో ఉత్తేజం



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి :భూమి కోసం,భుక్తి కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. మహబూబాబాద్ లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 1 నుండి 9వ తేదీ వరకు జరిగే అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దోపిడీ,పీడనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సభల ద్వారా కార్మికులు,రైతులు, పేదల సమస్యలపై చర్చించి,హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో యువత,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హలావత్ లింగన్న, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, బట్టు చైతన్య, ఎస్. కె.బాబు,పర్వత కోటేష్,బోనగిరి మధు,తెలబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టైగర్ జోన్ ను ఎత్తివేయాలని 68 వ రోజు కొనసాగుతున్న దీక్ష



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : టైగర్ జోన్ ఎత్తివేతకు సామాజికవేత్త శ్రీరాముల భూమాచారి చేస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం వరకు 68 వ రోజు వరకు చేరుకుంది. ఈ దీక్షకు మండలంలోని ట్రాక్టర్ అసోసియేషన్ వారు తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్నారం మండల కేంద్రంలో సామాజికవేత్త శ్రీరాముల భూమాచారి 68 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష కు ఎవరు స్పందించుటలేదని, ఈ ఉద్యమాన్ని ఉధృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, ప్రత్యక్ష పోరాటానికి రూపకల్పన చేయాలి అని ఇది ఎంతవరకు సాగినా కూడా వదలకుండా విజయం సాధించేవరకు వదిలే ప్రసక్తేలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు బొంతల చంద్రమౌళి,అనుముల శ్రీనివాస్, కొత్త తిరుపతి,కాశెట్టి శ్రీనివాస్, కటకం సతీష్, రాథోడ్ తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

: మంత్రి పొంగులేటి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పాల్వంచలో హెచ్‌పీ గ్యాస్ మేనేజర్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడి లక్ష్మీనారాయణ ఆత్మహత్యకుగల కారణాలను తెలుసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, పాల్వంచ తహశీల్దార్ దారా ప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా నాయకులు



కూకట్పల్లి, ప్రజాస్ఫూర్తి: జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాన చేపట్టిన మహా పాదయాత్రకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మూడో రోజు పాదయాత్ర సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ యాదగిరి, బాలాజీనగర్ డివిజన్ ఓబీసీ మోర్చా కన్వీనర్ ప్రేమ్, జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్ తదితరులు పాదయాత్రలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు అంశంపై ప్రజల తరఫున చేపట్టిన ఈ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి తమ మద్దతు ఉంటుందని నాయకులు పేర్కొన్నారు.

శ్రీ రామ నవమి వరకు రామాలయం నిర్మాణం పూర్తి చేస్తాం

*** రామాలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం లో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా :నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్ధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే కొంత మంది దుష్ట శక్తులు భైంసా ను అభివృద్ధి చేయడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు.గురువారం భైంసా పట్టణం లోని రామ్ లీలా మైదానం లో 50 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న శివ రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా అయన మాట్లాడారు. రామనవమి వేళ ఇచ్చిన మాట ప్రకారం శివ రామాలయ నిర్మాణానికి 40 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. వచ్చే శ్రీ రామ నవమి వరకు ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.. భవ్య మైనా రామ మందిరం నిర్మించు కోవడం ఎంతో అనందంగా ఉందని ఆలయాల్లో దేవత మూర్తులకు తానే స్వంత డబ్బులు వేచిస్తానన్నారు.. తన హయం లో సరస్వతి అమ్మ వారి ఆశీస్సులతో బాసర ఆలయ నిర్మాణానికి 350 కోట్ల రూపాయల నిధులు మంజూరై పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అదే విధంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని త్వరలో నే ప్రారంభిస్తున్నామన్నారు. భైంసా లో అయ్యప్ప ఆలయాని కి వెళ్లాడని 50 లక్షల రూపాయల నిధులతో సి. సి. రోడు వేయడం జరిగిందన్నారు. త్వరలో గట్టు మైసమ్మ ఆలయ రోడ్ కు నిధులు మంజూరు కావడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని త్వరలో నే పనులు ప్రారంభిస్తామన్నారు.. నియోజకవర్గం లో ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తో పలు అభివృద్ధి పనులు చేస్తుంటే గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు..అంతకు ముందు కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి,ప్రముఖ పూజారి బాబ్బ మహారాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగాధర్, కౌన్సిలర్ చింతపండు రజిత మహేష్, మాట్లాడుతూ భైంసా లో రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు వారు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.. రామాలయం నిర్మించడం శుభప్రదం అన్నారు.కార్యక్రమం లో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నీటిని అందరూ పొదుపుగా వినియోగించుకోవాలి

*** ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం రోజున నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . గ్రామాల్లో నీటిని వృధాగా వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వలను పెంచడానికి ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని తెలియజేశారు. రాబోయే వేసవి కాలంలోనీటికొరతలేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లో నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండలంలోని గ్రామ సర్పంచులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో స్మార్ట్ రేషన్ కార్డులతోపాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీవో హుమర్ షరీఫ్, పిఎసిఎస్ చైర్మన్ అల్లం రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, మండలంలోని గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచే దిశగా అడుగులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన శవపరీక్ష కేంద్ర భవనాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి ఉత్తమ ఆస్పత్రిగా గుర్తింపు లభించడం వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా సేవలు అందించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ పంకుడోత్ సునీత కొమ్ములు నాయక్, ఉప సర్పంచ్ చంటి స్వామి,మండల పార్టీ అధ్యక్షులు బాలాజీ నాయక్,మాజీ అధ్యక్షులు చిట్టె వెంకన్న,డిసిహెచ్ఎస్ డాక్టర్ చింత రమేష్,మెడికల్ బోర్డు సభ్యులు సంగేపు స్వామి,గోపిశెట్టి సౌజన్య,ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్ననాయక్,పార్టీ నాయకులు, వైద్యులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు

- ఐకేపి ఏపిఎం దేవేందర్



అందోలు,ప్రజాస్ఫూర్తి : రైతులకు మద్దత్తు ధరను కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి ధాన్యాన్ని సేకరిస్తోందని ఐకేపి ఏపిఎం దేవేందర్, సర్పంచ్ తెనుగు సునీత లు అన్నారు. గురువారం అందోలు మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలుకేంద్రాన్నిప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2461, సాధారణ రకానికి రూ.2441 మద్దతు ధరను చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న వడ్ల రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ కలుపుకొని రూ.2961 అందిస్తుందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించే సమయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తుందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ముందు నిబంధనల ప్రకారం తాలు లేకుండా తేమ శాతం 17 శాతంలోపు ఉండేలా చూసుకోవాలన్నారు.రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులేవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.కార్యక్రమంలో ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేరి సంగారెడ్డి,మాజీ ఎంపిటీసీ బాలయ్య, ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు మహిపాల్, మాధవరెడ్డి, శివచందర్, లక్ష్మీసదానందం, రమాదేవి దుర్గేష్, యువ నాయకులు రమేశ్‌గౌడ్, బాల్‌రాజ్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, సీసీ సత్యనారాయణ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మీ, కోశాధికారి పెంటమ్మ, విఓఏ అంజనేయులు, రవీందర్, జోగాల అంజయ్య, సత్తయ్య, దుర్గయ్య, కె.రమేశ్, దుర్గేష్, పంతులు ఈశ్వర్, వెంకటేశం, యాదయ్య, అనిల్, గంగరాం తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

: సేవాలాల్ సేన



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీపై కొందరు అసత్య, నిరాధార కథనాలు ప్రచారం చేస్తూ ప్రజలను, వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్ ఆరోపించారు. మార్కెట్ కమిటీపై తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆయన సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బోడ బాలు నాయక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మార్కెట్ కమిటీలో ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే జరుగుతుందని తెలిపారు. లైసెన్సుల మంజూరులో స్థానిక మార్కెట్ కమిటీకి నిర్ణయాధికారం ఉండదని, సంబంధిత ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియలో స్థానిక మార్కెట్ కమిటీ పాత్రపై వాస్తవాలు తెలుసుకోకుండా అవినీతి ఆరోపణలు చేయడం సరికాదని భూక్య శ్రీను నాయక్ అన్నారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు నాయక్, మండల అధ్యక్షుడు బోడ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

: సీ.పీ ఎన్.శ్వేత



జనగామ,ప్రజాస్ఫూర్తి : రహదారి ప్రమా దాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో పోలీస్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన సీ.సీ కెమెరాల పని తీరును ఆమె పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఆసుపత్రి ఎదుట డివైడర్ల పై పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించా లని, రాత్రివేళల్లో వాహన దారులకు రహదారి స్పష్టంగా కనిపించేలా జాతీ య రహదారి పై రేడియం సూచికలు ఏర్పాటు చేయాలని మున్సిపల్, జాతీ య రహదారుల అధికారులకు సూచిం చారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త లు తీసుకోవాలని, వాహనదా రుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ పీ రాజా మహేంద్ర నాయక్, అదనపు ఎస్పీ ప్రభాకర్ తోపాటు పోలీస్, మున్సి పల్, జాతీయ రహదారుల శాఖ అధికా రులు నెలుట్ల సర్పంచ్ నర్సింగ రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో మూలనపడిన వాహనాలకు మోక్షం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహ బూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆ ధీ నం లో ఎ న్నో నెలలుగా మూలనపడిన వా హ నా ల వేలానికి లైన్ క్లియర్ అయింది. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి.కరమ్ చంద్ నుంచి ఉత్తర్వులు జా రీ అ య్యా యి. ఆ ఉత్తర్వుల ప్రకారం,ఈ నెల 31న ఉదయం 11 గంటలకు, అనంతర రోడ్డులోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో 30 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.రామ్ ప్రసాద్ తెలిపారు.వేలం వేయనున్న వాటిలో 4 ద్విచక్ర వాహనాలు రోడ్ పర్తీగా ఉన్నాయని,మిగిలిన 26 వాహనాలు స్క్రాప్ కింద ఉన్నాయని పేర్కొన్నారు. స్క్రాప్ లో 24 ద్విచక్ర వాహనాలు,2 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి.వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు ఫారం, ఆధార్,పాన్ కార్డులతో పాటు నిర్ణీత ఈఎండీ మొత్తాన్ని చెల్లించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి,బైంసా :జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన,నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక, నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.టీబీ వ్యాధి



నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్యామ్సుందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్,వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా నిలిచే పథకంపై అవగాహన



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :రోడ్డు ప్రమాద బాధితుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సూచించారు.ఈ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందుతుందని తెలిపారు. అర్హులైన వారు ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ సేవలను పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 112 నంబర్ కు సమాచారం ఇవ్వాలని, క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని కోరారు.ప్రమాద బాధితులకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,మానవతా దృక్పథంతో వ్యవహరించి పోలీసులకు,వైద్య సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పథకానికి సంబంధించిన అర్హతలు, ఆసుపత్రుల వివరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.

నేలకొరిగిన వరి పొలాలు పరిశీలించిన అధికారులు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: తుఫాను ప్రభావం కారణంగా నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. గురువారం కూసుమంచి మండలంలోని కూసుమంచి, కిష్టాపురం గ్రామాలలో వర్షానికి నేలకొరిగిన వరి పంటను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వల్ల జరిగిన నష్టాన్ని ప్రాథమిక అంచనా రూపొందిస్తామని తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన యాసంగిలో వరి మొక్కజొన్న వంటి పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి, తక్కువ నీటితో సాగు చేసే అపరాలు, నూనె గింజలు వంటి పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, కూసుమంచి క్లస్టర్ ఏఈఓ జానీ బాబా, రైతులు పాల్గొన్నారు.

ప్రాణత్యాగాలకు గౌరవంగా వెలిగిన దీపాలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మహబూబాబాద్ రూరల్ పోలీసులు గురువారం ఈదుల పూసపల్లి గ్రామంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, ఎస్ఐలు రాజు, మనోహర్ తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో చేతుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీఐ అంజలి మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగం మరువలేనిదన్నారు. వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి స్ఫూర్తిని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ ర్యాలీలో గ్రామ ప్రజలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు జోహార్లు అర్పించారు.

వాహనదారులకు షాక్ పట్టుకున్న పోలీసులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ పట్టణంలో రూల్స్ పాటించని వాహనదారులకు పోలీసులు షాక్ ఇచ్చారు.తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి, నెంబర్ ప్లేట్ లేని బైకులు,డాక్యుమెంట్లు లేని వాహనాలను ఒక్కొక్కటిగా పట్టుకున్నారు.టౌన్ సీఐ రఘుపతి రెడ్డి దగ్గరుండి వాహనాలను చెక్ చేశారు.సైలెన్సర్ మోతలు,ట్రిపుల్ రైడింగ్,నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై దూసుకెళ్తున్న వారికి ముకుతాడు వేశారు. పత్రాలు లేవా? జరిమానా కట్టాల్సిందేనంటూ స్పాట్ లోనే ఫైన్లు వేశారు.ఇది కేవలం తనిఖీ మాత్రమే కాదు.ప్రాణాలు కాపాడే హెచ్చరిక అని సీఐ స్పష్టం చేశారు.రూల్స్ బ్రేక్ చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్,కానిస్టేబుల్ పాపాలాల్,ఇతర కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడటం..

వృధాను అరికట్టడం.. ప్రతి ఒక్కరి బాధ్యత

: ఎల్ నినో ప్రభావం - తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు

- జడ్పీ సీఈఓ శోభారాణి, డీపీవో శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అందుబాటులో ఉన్న నీటిన వృధాను అరికట్టి.. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జడ్పీ సీఈఓ శోభారాణి,డీపీవో శ్రీనివాస్రెడ్డిఅన్నారు. చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామంలో సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన ఎల్ నినో ప్రభావం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నీటిని వృధా చేయొద్దని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం వినియోగం చేసుకోవాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం తీవ్రరూపం దాల్చడం,రాబోయేరోజుల్లో కరువు పరిస్థితుల దృష్ట్యా ప్రజలు నీటి వినియోగాన్ని విద్యుత్ వినియోగాల్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. ప్రతి ఇంటిలో నీటి వృధాను అరికట్టాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మసులుకోవాలన్నారు. పరిశుభ్రతతో పాటు, ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి ఎద్దడిని తట్టుకునేలా వనరులను పొదుపుగా వాడుకోవడం తప్పనిసరి అన్నారు.గాలి,నీరు,భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని, భవిష్యత్ తరాలకు ఈ స్వచ్ఛ సంపదను అందించాలని కోరారు. అదేవిధంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తీసుకోవాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నీటి ఎద్దడి సమస్య తలెత్తదన్నారు. ఫారం పాండ్లు తీసుకొని ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలత, డీ ఎల్ పి ఓ ప్రతాప్ నాయక్, ఎంపీవో చంద్రశేఖర్, ఉప సర్పంచ్ ముద్దం రమేష్, ఆర్ఐ రాంరెడ్డి, ఏపీవో ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జీపీవో జ్యోతి, ఈసీ రమాదేవి, టీఏ ధనమ్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను

ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా :వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో చేపడుతున్న అన్ని మౌళిక వసతుల పనులను నవంబర్ నెలాఖరు లోగా యుద్ధప్రతిపాదన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్తో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలుగుమట్ల కాలనీలో నిర్మాణాలు మౌళిక వసతులతో సహా పూర్తి కావాలన్నారు.ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు,పూర్తికావాల్సిన పనులు,పనుల పురోగతి వివరాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రతి రోజూ పనులను, ఇళ్ల నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. నిర్మాణాల్లో ఎటువంటి సమస్య వచ్చిన అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఇళ్ల నిర్మాణంతోపాటు బస్తీ దవాఖానా, పాఠశాలల నిర్మాణాలు, రహదారులు, డ్రైనేజీలు తదితర మౌళిక వసతుల పనులను పూర్తి చేయాలని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలోసుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృత పరచాలి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సంస్థ ఎదుర్కొంటున్నసమస్యలపరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఐఆర్సీఎస్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కార్యకలాపాలకు ఊతమిచ్చేలా పలు అంశాలపై కలెక్టర్ సూచనలు చేస్తూ... సంస్థ ద్వారా ప్రజలకు వైద్య సేవలు, రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిరంతరం అందేలా చూడాలన్నారు. నూతన బ్లడ్ బ్యాంక్ మంజూరు, సంస్థ నిర్వహణ పారదర్శకతపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కైలాస్నగర్ వైట్ క్వార్టర్స్లో శిథిలావస్థకు చేరిన రెడ్ క్రాస్ భవనానికి తాత్కాలిక మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వ కేటాయించిన స్థలంలో వసతులు కల్పించడంపై చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఐఆర్సీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్, వైస్ చైర్మన్ మనోహర్ రావు, స్టేట్ కమిటీ మెంబర్ ఎన్. రాజేశ్వర్ రావు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సభ్యులు పార్థసారథి, రూపేష్ రెడ్డి, అనిల్, సంజయ్, విశ్వనాథ్, కృష్ణ, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



35వ వార్డులో సిసి డ్రైన్ కు శంకుస్థాపన

ప్రజాస్ఫూర్తి,సూర్యాపేట:పట్టణంలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో కౌన్సిలర్ జ్యోతి కరుణాకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, పాలగాని కృష్ణ, నిమ్మల వెంకన్న, వల్దాసు దేవేందర్, యాట ఉపేందర్, తండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి వెంకాయమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన సాబీర్ పాషా



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :చుంచుపల్లి మండలం విద్యానగర్ పంచాయతీలో గల రాంనగర్ ప్రాంతానికి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు దాసరి సుబ్బారావు సతీమణి దాసరి వెంకాయమ్మ అకాల మరణం పట్ల ఆమె పార్థివ దేహానికి సాబీర్ పాషా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకాయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, వెంకాయమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి , సిపిఐ పార్టీ నాయకులు పిల్లి రామ్మూర్తి , సల్ల వేణు , దావా కృష్ణ , మహేశ్వరరావు , యేలాద్రి , రామారావు , వారి కుటుంబ సభ్యులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు .

ఇకనుండి నాణ్యమైన విద్యుత్, విద్యుత్ అధికారులు



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం,33/11 కేవీ సుందరగిరి సబ్స్టేషన్ విజయవంతంగా ఛార్జింగ్ కరీంనగర్: 33/11 కేవీ సుందరగిరి సబ్స్టేషన్ను అధికారులు, సిబ్బంది సమక్షంలో విజయవంతంగా ఛార్జింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), డైరెక్టర్ (ఆపరేషన్స్), సీఈ (ప్రాజెక్ట్స్), ఎస్ఈ (ఆపరేషన్స్), కరీంనగర్, డీఈ (ఎంఆర్టీ & కన్స్ట్రక్షన్), డీఈ (ఆపరేషన్స్), రూరల్ కరీంనగర్, ఏడీఈ (ఆపరేషన్స్), సుస్తులాపూర్, ఏడీఈ (సివిల్), కరీంనగర్, ఏడీఈ/టీఆర్ఈ & ఎస్పీఎం, ఏడీఈ/ప్రొటెక్షన్, కరీంనగర్ తదితర అధికారులు పాల్గొన్నారు.అలాగే ఎంఆర్టీ విభాగం, ఆపరేషన్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది, ఏఈ (ఆపరేషన్స్), ఇందుర్తి వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సబ్స్టేషన్ను విజయవంతంగా టెక్నికల్ ఛార్జింగ్ చేసి, కమీషనింగ్ ప్రక్రియను పూర్తి చేయడంలో కృషి చేసిన అధికారులకు, ఇంజినీర్లకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ విజయం విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడంలో కీలకంగా నిలవనుంది

ఎలక్ట్రానిక్ వ్యర్థాల పై విద్యార్థులకు అవగాహన



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, నిర్వహణపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలు, తడి, పొడి చెత్త, బయో వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేక రించాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రిన్సిపాల్ జి.సునీత, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కుంభం

భువనగిరి, ప్రజాస్ఫూర్తి :భువనగిరి నియోజకవర్గంలో ని బీబీనగర్ వలిగొండ మండలాలలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు ఉదయం 9:30 కి బీబీనగర్ మండలంలోని కొండమడుగు లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు అదేవిధంగా 10:15 కి రాఘవపూర్ లో 10:45 కి బ్రాహ్మణపల్లి లో 12 గంటలకు రాయగిరి గేటు వద్ద నూతనంగా నిర్మించనున్న యాదాద్రి ఆర్చ్ తోరణం పనులు ప్రారంభోత్సవం అనంతరం వలిగొండ మండలంలో మధ్యాహ్నం ఒంటిగంట 15 నిమిషాలకి ఏదులగూడెం ప్రొద్దుటూరు మాందాపురం గ్రామాలతో పాటు వలిగొండ మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

బాధిత కుటుంబం సభ్యులను పరామర్శించిన

*** మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భైంసా :ఇటీవల బాసర కాంగ్రెస్ పార్టి సీనియర్ నాయకులు మాధవరావు దేశ్ ముఖ్ మృతి చెందడం తో బాసరలో ఆయన కుటుంబ సభ్యులను ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శించారు.పార్టీ తరపున తన తరపున ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని తెలిపారు. పరామర్శ లో సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, మాజీ పీడీసీ అధ్యక్షుడు కిష్టగౌడ్, నాయకులు బాశెట్టి రాజన్న, పెద్ద కొండ్రు సుధాకర్ రెడ్డి, ఉత్తమ్ బాలేరావ్, నర్సారి నరేష్, ఫసియొద్దిన్, శానవాజ్, కృష్ణ, చిట్టెపు రామారావు, పోతన్న, కన్నా, తన్వీర్, సాయిగౌడ్, హఫీజ్ లు పాల్గొన్నారు.

తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి

*** సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: బంగాళాఖాతంలో ఏర్పడిన పెనుతుపాన్ వలన,వరి పంట చేతికి వచ్చే సమయం లో, భారీ వర్షాలు, తీవ్రమైన గాలి వలన వరిపొలాలు మొత్తం పడిపోయి,రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయివున్నారని, ప్రభుత్వం వెంటనే అధికారులతో సర్వే చేయించి,నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గరిడేపల్లి మండలం గానుగు బండ గ్రామంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన వరి పంటలను రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నియో కారణం గా వాతావరణం లో మార్పులు వచ్చి సాగునీటి కోసం, కరెంట్ కోసం రైతులు ఇబ్బందులను ఎదుర్కొని, ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి,వ్యవసాయ పెట్టుబడులకు పైసలు లేక, వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట పండించుకొని, ఇంకో 15 రోజులలో పంట చేతికి వస్తుందనే తరుణంలో అనుకోకుండా,తుపాన్ వలన వర్షాలు పడటం వలన గరిడేపల్లి మండలంలోని,అన్నిగ్రామాలలో వరి పంటలు నేలకొరిగి క్రింద పడినాయని ఆయన అన్నారు.గాలికి వానకు పంట మొత్తం కింద పడటం వలన రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారని, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావనే బాధలో రైతులు ఉన్నారని,ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన పంట వివరాలను సేకరించి,పంట నష్టపోయిన రైతులను ఆదుకొని, ప్రభుత్వం రైతులకు తామున్నామనే భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య రైతు సంఘం నాయకులు కట్టా నర్సింహారావు, పంగ గోవిందు చిక్కుళ్ళ సైదులు పోకల ఆంజనేయులు మెండే వెంకన్న ఈద సైదులు ఈశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతోనే మండల ప్రగతి

*** శ్రీరంగాపూర్ ఎంపీపీ సమీక్షా సమావేశం**



శ్రీరంగపురం మండలం, ప్రజా స్ఫూర్తి: మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించారు. మండలంలోని పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం , ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో భాగంగా అధికారులు తమ పరిధిలోని ప్రగతి నివేదికలను సమర్పించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించాలని, వివిధ శాఖల సమన్వయంతో మండల ప్రగతికి తోడ్పడాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుధారాణి, ఎంపీడీవో చెన్నయ్య, తహసిల్దార్ వరలక్ష్మి, ఎంపీవో రాజ్ కుమార్, పెబ్బేర్ సింగిల్ విండో చైర్మన్ రామ్ రెడ్డి, ఎస్సై హిమబిందు, వ్యవసాయ అధికారి హైమావతి, వైద్య అధికారి రాముడు, విద్యాధికారి హనుమంతు, ఏపీఎం చంద్రకళ, పశు వైద్య అధికారి మాధవి, గ్రామాల సర్పంచులు, తదితర వివిధ విభాగాలకు చెందిన మండల అధికారులు అందరూ పాల్గొన్నారు.

ఎస్సై సతీష్ ను కలిసిన సీపీఎం సభ్యులు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఇటీవల కూసుమంచి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ను గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి, యడవల్లి రమణారెడ్డి, నవతెలంగాణ రిపోర్టర్ కర్ణబాబు, సిపిఎం ఆఫీస్ కార్యదర్శి ప్రసాద్, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

*** అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి**

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి, భైంసా :జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని,స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ సంస్థలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు,సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ పరీక్షల సమయానికి సిలబస్ పూర్తిచేయడంతోపాటు, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఎంఈసీ విభాగం విద్యార్థులతో మాట్లాడి విద్య, భోజనం, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారిని అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.గండిరామన్న నుంచి కమలానగర్ వరకు చేపడుతున్న అటవీ, రెవెన్యూ భూముల రీసర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అటవీ, రెవెన్యూ శాఖల



భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ భూముల సరిహద్దుల నిర్ధారణకు,భవిష్యత్తులో వివాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు.ఈ పర్యటనలో డివిఎహెచ్ఓ సురేష్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, మున్సిపల్ డీఈ హరిభువన్, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

*** విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన**

జనగామ, ప్రజాస్ఫూర్తి : పోలీస్ అమర వీరుల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మాంగల్య ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు,నేరాల నియంత్రణ లో పోలీసులు అనుసరించే విధానాలు, ప్రజల రక్షణ కోసం చేపట్టే చర్య లను వివరించారు. పోలీసులకు, ప్రజల కు మధ్య సత్సంబంధాలు ఉండటం ద్వారా సమాజంలో శాంతిభద్రతల పరి రక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. విద్యార్థులు చట్టా ల పై అవగాహన పెంపొందించుకోవడంతోపాటు రహదారి



భద్రతా నియమాల ను తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి దు ష్ప్రభావాల పై ఇతరులకు కూడా అవ గా హన కల్పించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చ ట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, పోలీస్ శాఖ పై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని జనగామ పోలీస్ శాఖ పేర్కొంది.

చిరు వ్యాపారులపైనే ప్రతాపమా?

*** బహుళ అంతస్తుల భవనంపై 25 రోజులుగా చర్యలేవి?**

*** కలెక్టర్‌కు ఎస్.పీ.కే. సాగర్ ఫిర్యాదు**

జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లిలో 200 అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా చిరు వ్యాపారుల షెడ్లను తొలగించిన అధికారులు, మార్కింగ్ చేసిన బహుళ అంతస్తుల భవనంపై 25 రోజులుగా చర్యలు తీసుకోకపోవడంపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్.పీ.కే. సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్



శర్మను కలిసి ఫిర్యాదు చేశారు.చిరు వ్యాపారుల షెడ్లను వెంటనే కూల్చివేసిన అధికారులు, బహుళ అంతస్తుల భవనం విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలిపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జీఓ నంబర్ 633 ప్రకారం 200 అడుగుల రోడ్డు విస్తరణను గజం కూడా తగ్గకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లోనే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, కూడలిని సమగ్రంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి:గురువారం వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, వారి హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా,రోజువారీ హాజరును ప్రమాణ్ యాప్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారని, వారికి సంబంధించిన వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారని , రోగుల వివరాలను అభా యాప్‌లో కూడా నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. రోగులకు అవసరమైన వైద్య



సేవలను సకాలంలో అందించాలని సూచించారు.అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, సేకరించిన నమూనాలను తదుపరి పరీక్షల కోసం ఎక్కడికి పంపిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.గర్భిణులకు సంబంధించిన ఏఎన్‌సీ (ఎఎన్సీ) రిపోర్టులను పరిశీలించి, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా,ప్రసవాల కోసం ఏయే ఆసుపత్రులకు వెళ్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పుట్టిన శిశువులకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా అని ఆరా తీశారు. 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ (హెచ్పివి) టీకాలు వేస్తున్నారా అని అమలు తీరును పరిశీలించి, అర్హులైన బాలికలకు టీకాలు అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో డెంగ్యూ జ్వర కేసులు ఏమి అయినా నమోదయ్యాయా అని ఆరా తీశారు, కేసులు ఉంటే బాధితులకు ఎలాంటి వైద్య చికిత్స అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల లక్షణాలతో వచ్చే వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకానికి వివాహిత కుమార్తె అర్హురాలే

*** తీర్పు వెలువరించిన హైకోర్టు**

హైదరాబాద్: ''కారుణ్య నియామకానికి వివాహిత కుమార్తె కూడా అర్హురాలే. కుమార్తెను, కుమారుడిని వేరు చేసే ఎలాంటి వర్గీకరణ అయినా రాజ్యాంగ విరుద్ధమే. విడాకులు పొందిన, భర్త పదిలివేసిన మహిళకు మాత్రమే అర్హతను పరిమితం చేసే వర్గీకరణ చట్టం ముందు నిలవదని సయారా ఖాతూన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాబట్టి అసిస్టెంట్ లైన్‌మేన్‌గా పనిచేస్తూ తండ్రి మృతి చెందడంతో కారుణ్య నియామకం కోసం 11 ఏళ్లుగా పోరాటం చేస్తున్న కె.జ్యోతికి నియామక ఉత్తర్వులు జారీ చేయాలి'' అంటూ హైకోర్టు ఎస్పీడీసీఎల్‌ను ఆదేశించింది. ఎస్పీడీసీఎల్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ కె.రామకృష్ణారెడ్డి 2014లో మృతి చెందారు. కుటుంబ బాధ్యతల నిమిత్తం కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలంటూ ఇచ్చిన వినతి పత్రాన్ని తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ జ్యోతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ ఇటీవల తీర్పు వెలువరించారు. ''పిటిషనర్ తండ్రి మృతి చెందేనాటికి తల్లి,కుమారుడు, పిటిషనర్ వారసులుగా ఉన్నారు. కుమారుడు విద్య కోసం లండన్‌లో ఉంటూ ఇక్కడ విధులు నిర్వహించడానికి నిరాకరించారు. కుటుంబసభ్యుల అందరి ఆమోదంతో కారుణ్య నియామకం కోసం పిటిషనర్ దరఖాస్తు చేశారు. పిటిషనర్‌కు పెళ్లి అయిందని, నిబంధనలు అంగీకరించవని తప్ప టీఎస్పీడీసీఎల్ మరెలాంటి కారణాలను చెప్పడంలేదు. కేవలం వివాహిత అన్నకారణంగా కారుణ్య నియామకాన్ని తిరస్కరించడం సరికాదు. ఆమెకు వర్తించే అన్ని ప్రయోజనాలతో కారుణ్య నియామకానికి తగిన ఉత్తర్వులు జారీ చేయాలి'' అని ఎస్పీడీసీఎల్‌ను ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): వచ్చే నెల 11, 12 తేదీల్లో మేడిపల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న డివిజన్ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్ సూచించారు. గురువారం ఐడీఓసీ సముదాయంలోని డీటీఓ కార్యాలయంలో పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు తాగునీరు, భోజనం, క్రీడా మైదానాలు, ప్రథమ చికిత్స పంటి సదుపాయాలు ముందుగానే కల్పించాలని ఆదేశించారు.పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, అన్ని పాఠశాలల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోటీలు క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వివిధ పాఠశాలల పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాసంగిలో అపరాల సాగే మేలు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: యాసంగి సాగు చేసే రైతులు అపరాలు మాత్రమే సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి డి పుల్లయ్య సూచించారు. గురువారం కూసుమంచి మండలంలోని గట్టుసింగారం, పెరికసింగారం, తుమ్మలతండా గ్రామాలలో బుధవారం కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాలు పాలు పోసుకునే దశ నుండి గింజ గట్టి పడే దశలో ఉన్నందున, పడిపోయిన పొలాలు నీటిలో మునిగి ఉంటే ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి ఆ ద్రావణాన్ని పిచికారి చేయడం వల్ల గింజ మొలకెత్తకుండా ఉంటుందని సూచించారు. అనంతరం పరికసింగారం గ్రామంలో యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా వేసుకోవాల్సిన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్ సూచించారు. గురువారం గొల్లబుద్దారం గ్రామంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు, నిత్యావసర సరుకుల నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ఆరా తీసి, పరిశుభ్రమైన వాతావరణంలో పోషకాహారం అందించాలని ఆదేశించారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీలో వసతి గృహ సంక్షేమాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునేలా అయిల్ ఫామ్ సాగులో జాగ్రత్తలు

ప్రజా స్ఫూర్తి,భైంసా :ఎల్‌నినో ప్రభావంతో ఆయిల్‌పామ్ పంటపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించి మొక్కలను నీటి ఒత్తిడి నుంచి కాపాడేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భైంసా డివిజన్ ఉద్యాన అధికారి షేక్ జావిద్ పాషా సూచించారు. మండల కేంద్రమైన ముథోల్ రైతు వేదికలో గురువారం ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగులో ఎల్‌నినో ప్రభావం, నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ మొక్కలకు తగినంత నీటిని అందించడంతోపాటు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులను వినియోగించాలని తెలిపారు. పొటాష్ ఎరువుల వాడకంపై శాస్త్రీయ సూచనలు పాటించడం ద్వారా నీటి



కొరత వల్ల కలిగే ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చని వివరించారు. మొక్కల్లో 30 నుంచి 35 ఆకులు ఉండేలా తగిన యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణ కోసం పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. నీటి కుంటల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ద్వారా రైతులకు సహాయం అందించే అవకాశం ఉందని వివరించారు. ఆయిల్‌పామ్ పంటతోపాటు పరాగసంపర్క కీటకాలపై ఎల్‌నినో ప్రభావం ఎలా ఉంటుందో కూడా ఆయన వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త దినేష్, మండల వ్యవసాయ అధికారి రచన, ముథోల్ వ్యవసాయ విస్తరణ అధికారి రాణి, ఉద్యాన విస్తరణ అధికారి మోయిన్ మియా, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు, ముథోల్, తానూర్, బాసర మండలాలకు చెందిన ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

*** జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా:గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా అన్నారు. గురువారం సిటీ లైబ్రరీ లోని ఛాంబర్ లో చైర్మన్ గ్రంథాలయ సర్వసభ్య సమావేశం నిర్వహించి, బడ్జెట్ పై చర్చించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల సౌకర్యాలు ,ఉద్యోగుల సంక్షేమం నిమిత్తం 20262027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్రంథాలయాల డిజిటలైజేషన్, ఇంటర్నెట్ సేవలు, కలర్ ప్రింటర్లు, అంధ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విజువల్లి ఛాలెంజ్డ్ విభాగం ఏర్పాటుకు సాఫ్ట్‌వేర్, పరికరాల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి, చదువుకునే యువతకు, పాఠకులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, గ్రంథాలయ కార్యదర్శి పి. పద్మజ, జిల్లా వయోజన విద్య అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గుడిసెల సర్వే, లబ్ధిదారు ల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా అధికారులను ఆదేశించారు. గు రువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స మీక్షలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధి దారుల ఎంపికపై సమీక్షించారు. జనగా మ మున్సిపాలిటీలో మిగిలిన 75 ఇళ్ల కు, ఇటిక్యాలపల్లిలో 18 ఇళ్లకు నవంబ ర్ 4న, పాలకుర్తి నియోజకవర్గంలో,7న , స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో, 11న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయిం పులకు లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల అర్హతలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని అధికారుల కు సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీ.డీ బలరామ రావు, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మొగిలి రహదారికి మహర్దశ.. రూ.5.90 కోట్లతో బీటీ రోడ్డు

*** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా :నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని మొగిలి గ్రామం నుండి తానూర్ వరకు బిటి రోడ్డు రూ.5.90 కోట్ల ఎం ఆర్ ఆర్ గ్రాంట్‌తో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిలి ,కోలార్, తానూర్, గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి నిర్మాణం సాకారం కానుందని తెలిపారు. రోడ్డు సౌకర్యం మెరుగుపడితే విద్యార్థులు, రైతులు, ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.గత పాలకుల నిర్లక్ష్యంతో మొగిలి గ్రామం అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రస్తుతం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. తానూర్ మండలానికి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా సంబంధిత మంత్రిని కలిసి విన్నవిస్తానన్నారు.అనంతరం తానూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీడీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల జీవితాల్లో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం, విజ్ఞానం పెరగడంతోపాటు మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, సంస్కారవంతమైన విలువలు అలవడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మండల సీనియర్ నాయకులు , కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లే భవిష్యత్ తరాలకు ఆస్తి

హైదరాబాద్: 'భూములు, బంగారం లాంటి ఆస్తులు కొన్ని తరాలకే పరిమితం. కానీ భవిష్యత్ తరాలకు ఇచ్చే అమూల్యమైన ఆస్తి రిజర్వేషన్లే' అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, తెలంగాణ బీసీ రైట్స్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించిన 'హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తమిళనాడు తరహాలోనే తెలంగాణ అసెంబ్లీలోనూ జనగణనలో ఓబీసీ కాలమ్, డ్రాప్‌డౌన్ బాక్స్ చేర్చాలంటూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందనే కేంద్రం 'కాలమ్'ను నిరాకరిస్తోందని ఆమె ఆరోపించారు.

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి..

*** సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డెకరేషన్ను తక్షణమే అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం భద్రాచలం రాములోరి దేవాలయం ప్రాంగణం హతీరం మఠం దగ్గర ప్రారంభం అయినా గిరిజన గళం, తండాలో నిద్ర పాదయాత్ర గురువారం కూసుమంచి మండల కేంద్రం చేరుకుంది. ఈ సందర్భంగా బంజారాలను ఉద్దేశించి హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, బంజారాలకు మంత్రి పదవులు ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్, లకావత్ భాస్కర్ నాయక్ డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ చూపించిన ఈ స్ఫూర్తితో డీమ్డ్ ప్రైవేట్ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి, ఏజెన్సీలో జీఓ నెం. 3 తరహా మరో జీఓను చట్టబద్ధత కల్పించాలని, గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్ లో చేర్చాలని చెప్పారు. నూతన తండా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించి తండా అభివృద్ధికి బోర్డు ఏర్పాటుకు చేసే పోరాటంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు.డిమాండ్ల సాధన కోసం నిర్వహించే గిరిజన గళం - తండాలో నిద్ర పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు మాలోత్ శివ, యువసేన నాయకులు బానోత్ భరత్, పరమేష్, బట్టు మంజుల, బాబూలాల్, భాస్కర్,గుగులోత్ భద్రు, రాందాస్, సారపాక యూత్ రాంబాబు, సురేష్. ప్రేమాకుమార్, నునవత్ రవి, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తేజావత్ శోభన్. రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా చెట్లు.. మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలో ఇరుకైన రోడ్డు, వాటికి అడ్డుగా ఉన్న భారీ వృక్షాల కారణంగా ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ ఆర్టీసీ బస్సు నడిచేదని, ప్రస్తుతం బస్సు లేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాజాగా రేకొండ చెరువు కట్ట దాటిన తర్వాత మూలమలుపు వద్ద ఇరుకైన రోడ్డుకు తోడు భారీ వృక్షం అడ్డుగా ఉండటం, అదే సమయంలో వడ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ పంచర్ కావడంతో ముల్కనూర్ నుండి చిగురుమామిడి మీదుగా రేకొండకు వచ్చే మోడల్ స్కూల్ బస్సు అక్కడే నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు బస్సు వద్దకు చేరుకోవడానికి కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సి వచ్చింది.

డిపో మేనేజర్, డ్రైవర్ స్పష్టత

ఇరుకైన రోడ్డు, చెట్ల కొమ్మల కారణంగా రేకొండ గ్రామానికి బస్సు తీసుకెళ్లలేమని ఆర్టీసీ డ్రైవర్ తేల్చిచెప్పినట్లు సమాచారం. డిపో మేనేజర్‌ను సంప్రదించగా.. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తేనే బస్సు నడిపిస్తామని, లేదంటే బస్సు రాదని స్పష్టం చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

*** సర్పంచ్ అల్లెపు సంపత్**



ఆవేదన

ఈ ఘటనపై రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్ స్పందిస్తూ.. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తుంటే, రాజకీయకక్షతోకొందరుతనపైనిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే పనులే చేస్తానని, బస్సు రాకపోకల సౌలభ్యం కోసం అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్.. వెంటనే స్పందించి ప్రైవేట్ ఆటో మాట్లాడి విద్యార్థులను నిలిచిపోయిన బస్సు వద్దకు చేర్చి, అక్కడి నుంచి మోడల్ స్కూల్‌కు పంపించారు. ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రేకొండ గ్రామా నికి ఆర్టీసీ బస్సు సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా:ఎల్నినో ప్రభావం వలన వర్షభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు తగ్గడం, వచ్చే ఏడాది ఆగస్టు వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కూరగాయలు, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని తేమతో పండే పంటలను ఎంచుకోవాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికీ మొదటి, రెండో విడతలు మంజూరయ్యాయని, మూడో, నాలుగో, ఐదో విడతలు మంజూరు అవుతాయని, ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.రాబోయే గ్రాడ్యుయేట్ ఎంబిసి ఎన్నికల దృష్ట్యా, అక్టోబర్ 31, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఫారమ్ 18 ద్వారా వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు కు నవంబర్ 6 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఓటరు లిస్టులో నమోదు చేసుకున్న, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు దరఖాస్తు తప్పనిసరి అని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని, ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు.కార్యక్రమంలో రైతులడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖల అధికారులు రైతులకు ఎల్నినో ప్రభావం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, ఇరిగేషన్ డిఈ రాజేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయ అధికారి సురేష్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

*** మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి:నగర పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం శ్రమించే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని మేయర్ బుర్రి చైతన్యశ్రీనివాస్ రెడ్డి సూచించారు.గురువారం నల్గొండ నగరపాలక సంస్థ కార్యాలయంలో శ్రీ సత్య డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల కోసం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణతో కలిసి మేయర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కార్మికులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దంత సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో డాక్టర్ అరవింద్ రెడ్డి, డాక్టర్ జిశాంక్, డాక్టర్ నందిని, ఎం.డి. నజీర్ ఖాన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణ, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :జిల్లాలో వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రజలందరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో శంకర నేత్రాలయ హైదరాబాద్, వనవాసీ కళ్యాణ్ పరిషత్ (తెలంగాణ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర చికిత్సల ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ఐటీడీఏ పీవో మంద మకరందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్, పిఓ వైద్యులు, రోగులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే వ్యవసాయం, చదువులు, వ్యాపారాలు అన్ని రంగాలలో రాణించవచ్చని తెలిపారు. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అక్టోబర్ 31 వరకు కంటి పరీక్షలు నిర్వహించి, నవంబర్ 1 వరకు కంటి ఆపరేషన్లు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కేవలం కంటి పరీక్షలు, ఆపరేషన్లే కాకుండా, అవసరమైన వారికి తదుపరి ఫాలోఅప్ సేవలు సైతం పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేదలకు ఇటువంటి సద్వినియోగ శిబిరాలు ఎంతో ప్రయోజనకరమని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రాజెక్ట్ ఆఫీసర్ మంద మకరందు మాట్లాడుతూ.. గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇటువంటి మొబైల్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఇప్పటివరకు 568 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 150 మందిని కంటి పొర ఆపరేషన్లకు ఎంపిక చేయగా, నిన్నటివరకు 30 మందికి, ఈరోజు మరో 30 మందికి విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ్ పరిషత్ కార్యకర్తలు సిడామ్ భీమ్రావు, హెచ్.కె. నాగు, ప్రకాష్, అజయ్, శంకర నేత్రాలయ కోఆర్డినేటర్ రాజు, వైద్యులు, స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా: కొండా సురేఖ

వరంగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో తాను చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో తానలా మాట్లాడానన్నారు. నిరాధారమైన ఆ వ్యాఖ్యలు చేసి ఉండకూడదన్నారు. కేటీఆర్, కుటుంబసభ్యులను బాధ పెట్టాలని.. వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేదన్నారు. తన వ్యాఖ్యలతో కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులను నొప్పించి ఉంటే చింతిస్తున్నానని పేర్కొన్నారు.తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని కొండా సురేఖ అన్నారు.

MOVIE TIME



అనౌన్స్ చేసిన ఆరు నెలల్లోనే రిలీజ్

పాన్ ఇండియన్ కల్చర్ కారణంగా స్టార్ డైరెక్టర్లు తమ సినిమాల షూటింగ్‌ల కోసమే రెండు, మూడేళ్లు టైమ్ తీసుకుంటున్నారు. కానీ దిగ్గజ దర్శకుడు మణిరత్నం మాత్రం అనౌన్స్ చేసిన ఐదు నెలల్లోనే తన కొత్త సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. విజయ్ సేతుపతి, సాయిపల్లవి జంటగా మణిరత్నం దర్శకత్వంలో తమిళంలో ఇంజివెల్లం పేరుతో ఓ రొమాంటిక్ మూవీ తెరకెక్కుతోంది. కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈసినిమా షూటింగ్ ఆగస్ట్‌లో మొదలైంది. కేవలం మూడు నెలల్లోనే షూటింగ్ మొత్తం పూర్తిచేశారు. ఇంజివెల్లం సినిమాకు సంబంధించి ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జనవరి 29న ఈ రొమాంటిక్ మూవీ థియేటర్లలోకి రానున్నట్లు చెబుతోన్నారు.

ఏఐ ఆధారంగా సినిమా

లొకేషన్లు, సెట్స్, మ్యూజిక్ డైరెక్టర్ లేకుండా ఏఐ ఆధారంగా బాలీవుడ్‌లో ఓ సినిమా రాబోతుంది. బేటా బిల్డర్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఫ్యామిలీ మ్యాన్ ఫేమ్ అశ్లేషా ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ టైమ్‌లోనే ఏఐ ప్రాంప్ట్‌లను వాడి బ్యాక్‌గ్రౌండ్‌లో తమకు కావాల్సిన లొకేషన్‌ను వర్చువల్ రియాలిటీలో క్రియేట్ చేస్తారు. భారీ సెట్స్ వేయకుండా...తాము అనుకున్న ఊహాజనీత ప్రపంచాన్ని సృష్టిస్తారు. ఇందులో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా ఏఐ ఆధారంగానే ఛేంజ్ చేస్తారు. లిమిటెడ్ బడ్జెట్‌లో కేవలం ఒకే స్టూడియోలో బేటా బిల్డర్ షూటింగ్ మొత్తం పూర్తిచేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ముంబై బ్యాక్‌డ్రాప్‌లో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాను ఏఐ వీడియో కంపెనీ ఇన్వీడియా నిర్మిస్తోంది.





త్రిష తెలుగు వెబ్‌సిరీస్

త్రిష తెలుగులో ఓ వెబ్‌సిరీస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సిరీస్ కోసం త్రిష పదిహేను కోట్ల వరకు రెమ్యూనరేషన్ స్వీకరించినట్లు సమాచారం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రూపొందుతోన్నట్లు టాక్ వినిపిస్తోంది. కాన్సెప్ట్‌తో పాటు తన క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉండటంతో ఇందులో నటించడానికి ఈ కోలీవుడ్ బ్యూటీ అంగీకరించినట్లు సమాచారం. అమ్మవారిగా, సాధారణ యువతిగా రెండు షేడ్స్‌తో సాగే పాత్రలో చెన్నై క్వీన్ కనిపించనున్నట్లు చెబుతోన్నారు. తెలుగులో రూపొందుతోన్న ఈ సిరీస్‌ను ఇతర భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.




షూటింగ్ పూర్తయిన నిహారిక మూవీ

కమిటీ కుర్రాళ్లు, రాకా బ్లాక్‌బస్టర్స్ తర్వాత ప్రొడ్యూసర్‌గా తన మూడో సినిమాను అనౌన్స్‌చేసింది మెగా డాటర్ నిహారిక కొణిదెల. పాకెట్ రాకెట్స్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో త్రినాథ్ వర్మ, శ్రియా కొంతం, నిర్మల్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ షూటింగ్ పూర్తయ్యింది. కమిటీ కుర్రాళ్లు, రాకా సినిమాలతో ప్రొడ్యూసర్‌గా పెద్ద విజయాలను అందుకుంది మెగా డాటర్ నిహారిక కొణిదెల కమిటీ కుర్రాళ్లు రెండు నేషనల్ అవార్డులను అందుకొని నిహారికకు మంచి పేరు తీసుకొచ్చింది. తాజాగా నిర్మాతగా మూడో సినిమాను అనౌన్స్ చేసింది మెగా డాటర్. గ్యాబ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు పాకెట్ రాకెట్స్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. త్వరలో టీజర్ విడుదల చేయడమే కాకుండా సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తామని మేకర్స్ అన్నారు.

దిగ్గజ దర్శకుడికి ఐదేళ్ల జైలు శిక్ష

ఇరాన్ దిగ్గజ దర్శకుడు జాఫర్ పనాహికి అక్కడి కోర్టు ఐదేళ్ల జైలు శిక్షను విధించింది. ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ సినిమాలు తీస్తున్నాడనే ఆరోపణలతో అతడికి జైలు శిక్షను ఖరారు చేసింది. సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించడమే కాకుండా ఇరాన్ వదిలి వెళ్లద్దంటూ ఆంక్షలు విధించింది. ఆయన ఇరానియన్‌లో గొప్ప దర్శకుల్లో ఒకరిగా కొనసాగుతోన్నారు. ఆయన తీసిన సినిమాలు పలు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకున్నాయి.





హీరోగా దళపతి విజయ్ కొడుకు

తమిళనాడు సీఎం దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. అతడి డెబ్యూ మూవీకి రాకా డైరెక్టర్ అట్లీ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించనున్నట్లు వార్తలొస్తున్నాయి. డ్యూడ్ ఫేమ్ కీర్తిశ్వరన్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను త్వరలో అఫీషియల్‌గా అనౌన్స్‌చేయబోతున్నట్లు సమాచారం. జాసన్ సంజయ్ సిగ్మా మూవీతో దర్శకుడిగా మారాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.